# ప్రజాశక్తి

సోమవారం 17 జూన్ 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి








# రాయితీపై వరి విత్తనం

- ఈ ఏడాది కొత్త రకాలు
- స్వల్పకాలంలో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్‌లో రైతుకు పంపిణీచేసే వరి విత్తనాలకు ప్రభుత్వం ధర నిర్ణయించింది. అధిక దిగుబడులు వచ్చే ప్రత్యామ్నాయ వరి విత్తనాలు ఈ సీజన్‌లో పంపిణీచేయడానికి వ్యవసాయశాఖ సిద్ధంచేసింది. ఎంతోకాలంగా వినియోగిస్తున్న సంప్రదాయ వరి విత్తనాలు బదులు అధిక దిగుబడులు వచ్చే కొత్త వంగడాలను వినియోగంలోకి వ్యవసాయశాఖ తీసుకొచ్చింది. స్వల్పకాలిక కాలంలో దిగుబడులు వచ్చే రకాలను ఈ ఏడాది ఖరీఫ్ నుంచి రైతులకు పంపిణీచేయనున్నారు. ఆర్‌జిఎల్ కంటే దిగుబడులు వచ్చే మార్టేర్ సాంబ, మార్టేరు మసూరి (ఎంటియు 1262), ఎంటియు 1318, శ్రీధృతి ఎంటియు 1121 రకాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో వ్యవసాయశాఖాధికారులు ఉంచారు.

సాంబ మసూరి, బిపిటి 5204కు ప్రత్యామ్నాయంగా మార్టేర్ సాంబ (ఎంటియు 1224) వరి విత్తనాలు తీసుకొచ్చారు. ఈ రకం వరి పంట 140 రోజుల కాలపరిమితిలో పండుతుంది. చేను పడిపోకుండా, సుడి దోమను తట్టుకొని ఎకరానికి 34 బస్తాల దిగుబడి వస్తుంది. ఇది సన్న బియ్యం రకం, గింజరాల్చే గుణం తక్కువ ఉంటుంది. శ్రీకాకుళం సన్నాలు (ఆర్‌జిఎల్ 2537)కు ప్రత్యామ్నాయంగా 155 రోజులు కాలపరిమితిలో మార్టేరు మసూరి (ఎంటియు 1262) రకం పడుతుంది. ఎండ, తెగులును తట్టుకొని ఎకరాకు 34 నుంచి 36 బస్తాల ధాన్యం దిగుబడి రానుంది. స్వర్ణ (ఎంటియు 7029)కు ప్రత్యామ్నాయంగా 150 రోజుల కాలపరిమితిలో పండే ఎంటియు 1318 రకం విత్తనం ఎకరాకు 40 బస్తాల దిగుబడి రానుంది. సుడి దోమ, అగ్గి తెగులు తట్టుకొనే స్వభావం ఈ రకం వరి విత్తనానికి ఉంది. శ్రీధృతి ఎంటియు 1121 రకం వరి విత్తనం 125 రోజులు కాలపరిమితిలో పండే ఈ రకం దోమ, అగ్గి తెగులు తట్టుకోవడంతో పాటు ధాన్యం రాల్చే గుణం ఈ విత్తనానికి ఉంది. ఎకరాకు 40బస్తాల ధాన్యం దిగుబడిరానుంది.

జిల్లాలో రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు రాయితీపై సరఫరా చేయనున్నారు. వరి

మిగతా 2లో..

**వరి రాయితీ విత్తన ధర, పరిమాణం**

| విత్తన రకం | (వాస్తవ ధర) | పరిమాణం |
|---|---|---|
| ఆర్‌జిఎల్2537 | 954 | 30 కేజీలు |
| బిపిటి 3291 | 834 | 30 కేజీలు |
| బిపిటి 5204 | 795 | 25 కేజీలు |
| ఎంటియు 1061 | 894 | 30 కేజీలు |
| ఎంటియు 1064 | 894 | 30 కేజీలు |
| ఎంటియు 1121 | 894 | 30 కేజీలు |
| ఎంటియు 1224 | 834 | 25 కేజీలు |
| ఎంటియు 1318 | 894 | 30 కేజీలు |
| ఎంటియు 7029 | 894 | 30 కేజీలు |
| ఎన్‌ఎల్ఆర్ 34449 | 915 | 30 కేజీలు |
| ఆర్ఎన్ఆర్ 15048 | 834 | 25 కేజీలు |



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

## ప్రశాంతంగా యుపిఎస్‌సి ప్రిలిమినరీ పరీక్ష

**- 4,677 మంది హాజరు**

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా కేంద్రంగా ఆదివారం నిర్వహించిన యుపిఎస్‌సి ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో పరీక్ష జరగ్గా సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పర్యవేక్షించారు. కృష్ణా కాలేజీ, ఎంవిపి.కాలనీలోని గాయిత్రీ కాలేజీల్లో ఏర్పాటుచేసిన కేంద్రాలను మల్లికార్జు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. అక్కడ పరిస్థితులను గమనించారు. మొత్తం 9,735 మంది దరఖాస్తు చేసుకోగా 4,677 మంది హాజరయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారి, లైజన్ అధికారులు, ఇతర అధికారులు పరీక్ష నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## విశాఖపట్నం-సంత్రగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి విశాఖపట్నం – సంత్రాగచ్చి మధ్య (08502/01) (08506/05) ప్రతి దిశలో 4 ట్రిప్పులు తిరిగేలా ప్రత్యేక రైళ్లను నడపాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే నిర్ణయించింది. ఈ క్రమంలో 08502 విశాఖపట్నం-సంత్రగచ్చి ప్రత్యేక రైలు ఈ నెల 19, 21, 26, 28 తేదీల్లో రాత్రి 23.45 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 15.25 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 08501 సంత్రాగచ్చి-విశాఖపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 20, 22, 27, 29 తేదీల్లో సాయంత్రం 17.00 గంటలకు సంత్రగచ్చిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం

మిగతా 2లో..

**ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన హోం మంత్రి అనిత**

వార్త 5లో..

**సామాజిక సేవల్లోనూ సిఐటియు**

వార్త 4లో..

**సమ న్యాయంతో మానవ హక్కుల పరిరక్షణ**

వార్త 4లో..

**తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చిన సుసర్ల**

వార్త 3లో..



రుషికొండ భవనాల పరిశీలనకు కూటమి నాయకులతో కలిసి వచ్చిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

'రుషికొండ' నిర్మాణాలపై

# త్వరలో నిర్ణయం

**భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**

వార్త మెయిన్ 3లో....

# నత్త నడకన మెయిన్ రోడ్డు విస్తరణ పనులు

**నష్టపోతున్నామని వ్యాపారుల ఆందోళన**



షాపులకు చెక్క వంతెనలు ఏర్పాటుచేసుకున్న దుకాణ యజమానులు

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలోని పాత నగరం మెయిన్ రోడ్డు విస్తరణ పనులు ఏళ్ల తరబడి కొనసాగుతుండం పట్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులతో పాటు వ్యాపారస్తులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యాపారస్తులు ఆర్థికంగా కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీస్ వరకు మెయిన్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. రెండేళ్లగా పనులు కొనసాగుతున్నాయి. జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీస్ వరకు 600 మీటర్ల మేర 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రహదారి విస్తరణ గత తెలుగుదేశం ప్రభుత్వం కాలంలో ప్రారంభించారు. అప్పట్లో ఈ మార్గంలో 438 నిర్మాణాలకు నష్టం వాటిల్లుతుందని, భవనాలు కోల్పోయే బాధితులకు రూ. 350 కోట్ల మేర నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు లెక్కలు గట్టి ప్రభుత్వానికి తెలిపారు. అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలను పక్కనపెట్టింది. అనంతరం అధికారానికి వచ్చిన వైసిపి ప్రభుత్వం మెయిన్ రోడ్డు విస్తరణ పనులపై దృష్టి సారించింది. పలుమార్లు ఈ ప్రాంతంలో భవనాలు కోల్పోతున్న వారితో సమావేశాల నిర్వహించి విస్తరణను 80 అడుగులు లేదా 60 అడుగులకు కుదించాలని భావించారు. 80 అడుగులకు కుదించడానికి అనేక మంది వ్యాపారులు అభ్యంతరం తెలిపారు. కొందరు కోర్టులను ఆశ్రయించారు. దీంతో ఈ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉండే వాసుపల్లి గణేష్ కుమార్ వ్యాపారస్తులతో మరికొన్ని సమావేశాలు నిర్వహించి, మెయిన్ రోడ్డు విస్తరణను 80 అడుగులు కాకుండా 60 అడుగులకు తగ్గించి విస్తరణ చేయడానికి ప్రతిపాదించి వారి ఆమోదం పొందారు. ఈ నేపథ్యంలో మెయిన్ రోడ్డు విస్తరణ పనులు రెండేళ్ల క్రితం చేపట్టారు. అయితే విస్తరణ

మిగతా 2లో..

**మొదటి పేజీ తరువాయి..**

## రాయితీపై వరి విత్తనం

విత్తనాలు ఆర్‌బికెలలో నిల్వ ఉంచినట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహనరావు తెలిపారు. డి-కృషి యాప్ ద్వారా రైతులు రిజిస్ట్రేషన్ చేసుకొని రాయితీ ధరకు విత్తనాలు పొందాల్సివుంది.

## విశాఖపట్నం-సంత్రగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు

8.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

08506 విశాఖపట్నం-సంత్రాగచ్చి ప్రత్యేక రైలు ఈ నెల 17, 22, 24, 29 తేదీల్లో రాత్రి 23.45 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 15.25 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 08505 సంత్రాగచ్చి-విశాఖపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 18, 23, 25, 30 తేదీలలో సాయంత్రం 17.00 గంటలకు సంత్రాగచ్చి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 08.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ జంట రైళ్లు విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ కె రోడ్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తాయని, వీటి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ కోరారు.

## నత్త నడకన మెయిన్ రోడ్డు విస్తరణ పనులు

సమయంలో భవనాలు కోల్పోతున్న వారికి నగదు కాకుండా ట్రాన్స్‌ఫర్ బుల్ డెవలప్‌మెంట్ రైట్(టిడిఆర్) ఇచ్చేందుకు జివిఎంసి అధికారులు ముందుకు వచ్చారు. ఇందువల్ల తాము నష్టపోతామని, కనీసం టిడిఆర్ పెంచాలని వ్యాపారులు కోరారు. దీంతో సాధారణంగా ఇచ్చే టిడిఆర్ కంటే నాలుగు రెట్లు అదనంగా ఇచ్చేందుకు అంగీకారం రావడంతో పనులు చేపట్టారు. దీంతో విస్తరణ పనులతో పాత పోస్టాఫీస్ నుంచి జగదాంబ వరకు 234 దుకాణాలు బాగా దెబ్బతిన్నాయి. వాటిని పునర్నిర్మించడానికి భవనాల యజమానులు రూ.లక్షలు ఖర్చు చేశారు. మరోపక్క రెండేళ్లగా పనులు నత్తనడకన సాగుతుండంతో వ్యాపారాలు సాగక చాలామంది దుకాణాలు మూసేశారు. ఇదే రోడ్డులో బ్యాంకులు, దేవాలయాలు, బడులు, మెడికల్ షాపులు ఉండడంతో అత్యవసర పనులపై వెళ్లే ప్రజలు చెక్కలపై ఎక్కి దిగుతూ ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇందువల్ల పలువురు ప్రమాదాల బారిన పడ్డారు కూడా. అయితే జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్‌వర్మ మెయిన్ రోడ్డు విస్తరణపై దృష్టి సారించడంతో జగదాంబ జంక్షన్ నుంచి చౌల్ట్రీ జంక్షన్ వరకు ఈసరికే రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులు జరిగాయి. అక్కడ నుంచి పూర్ణా మార్కెట్ వరకు రోడ్డుకు అటు ఇటు కొత్తగా డ్రైన్లను నిర్మించే పనులు పూర్తిచేశారు. విద్యుత్ స్తంభాలను తొలగించడం, కొత్తవి ఏర్పాటు చేయడం కూడా జరిగాయి. రోడ్డు వేయలేదు. పూర్ణా మార్కెట్ నుంచి పాత పోస్టాఫీస్ వరకు ఉన్న రోడ్డు భాగంలో డ్రెయిన్ల నిర్మాణ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. దీని వల్ల ఈ ప్రాంతంలోని దుకాణాలకు కొనుగోలుదారులు వెళ్లేందుకు అవకాశం ఉండక కొన్ని దుకాణాలు మూసివేశారు. కొన్ని దుకాణాలు వారు నిర్మాణంలో ఉన్న డ్రెయిన్లపై చెక్కలతో తాత్కాలిక వంతెన పద్ధతిలో ఏర్పాట్లు చేశారు. అటువంటి చెక్కల మార్గంపై వెళ్లేందుకు కొనుగోలుదారులు భయపడుతున్నారు. కొత్త రోడ్డు జంక్షన్ వద్ద మెయిన్ రోడ్డు అడ్డంగా ఉన్న కల్వర్టును పునర్నిర్మాణం చేసే పనులు చేపట్టారు. ఇది కూడా ఈ ప్రాంతంలో రాకపోకలకు అవరోధంగా ఉంది. ఇప్పటికైనా మెయిన్ రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, లేకుంటే వర్షాకాలం వస్తుందందున, రోడ్డు నిర్మాణ పనులకు అవరోధంగా ఉంటుందని అటు వ్యాపారులు, ఇటు స్థానికులు అంటున్నారు. జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మ మాత్రం తరచూ ఈ మార్గంలో పర్యటిస్తూ పనులను త్వరగా చేయించేలా చర్యలు చేపడుతున్నారు. దక్షిణ నియోజకవర్గం నుంచి కొత్తగా ఎన్నికైన జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మెయిన్ రోడ్డు విస్తరణపై దృష్టి సారించారు. ఎన్నికల ప్రచారంలో మెయిన్ రోడ్డు పనులు ఎంత అధ్వానంగా ఉన్నాయో తాను చూసానని, ఈ ప్రాంతంలో వ్యాపారులు, ప్రజలు పడుతున్న బాధలు తనకు తెలుసని, త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి జరిగేలా చర్యలు తీసుకుంటానని ఆయన ప్రత్యేకంగా వెల్లడించారు. నూతన ఎమ్మెల్యే మాట ప్రకారం మెయిన్ రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన జరుగుతాయని అందరూ భావిస్తున్నారు.

## వైసిపి ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు

### అయినా చేర్చుకునేది లేదు : గణబాబు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** వైసిపి ఎమ్మెల్యేలు కొందరు టిడిపిలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారని, అయితే వారిని టిడిపిలో చేర్చుకునే ప్రసక్తే లేదని పశ్చిమ టిడిపి ఎమ్మెల్యే పి.గణబాబు తెలిపారు. ఆదివారం రామ్‌నగర్‌లోని ఒక టూరిస్ట్ కేంద్రాన్ని ప్రారంభించిన సమయంలో, మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన పై విధంగా స్పందించారు. కూటమి నాయకత్వంలో అద్భుతమైన పాలనను ఆంధ్రప్రదేశ్ ప్రజలు చూస్తారన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు బడా పారిశ్రామిక వేత్తలు ఈసరికే ముందుకు వస్తున్నారని తెలిపారు. దేశంలోనే విశాఖ 9వ సంపన్న నగరమని, విశాఖ పర్యాటకంగా, అభివృద్ధి పరంగా మరో మైలురాయిని చేరుతుందని ఆశాభావం వ్యక్తపరిచారు.

# రక్తదానం అంటే ప్రాణదానమే

### కనకమహాలక్ష్మి బ్యాంక్ చైర్మన్ రాంబాబు



రక్తదాన శిబిరం ప్రారంభంలో పాల్గొన్న బ్యాంకు ప్రతినిధులు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** రక్తదానం అంటే ప్రాణదానమేనని కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. స్వయంగా ఆయన రక్తదానం చేశారు. అక్కయ్యపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో, ఆదివారం రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. బ్యాంకు 25 సంవత్సరాలు పూర్తి చేసుకొని రజతోత్సవం చేసుకుంటున్న సందర్భంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. రక్తదానం చేయడంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, శ్రేయోభిలాషులు కూడా భాగస్వాములు కావడం హర్షించదగిన విషయం అన్నారు. తొలుత బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, ఎయు మాజీ రిజిస్ట్రార్, లయన్స్ కేన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బ్యాంకు సిబ్బందికి, ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు లీ ఫార్మా లిమిటెడ్‌చే సుగర్, బిపి, ఎముకల పటుత్వం పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వైద్య, బ్యాంకు సిబ్బందికి బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యాంకిషోర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు డాక్టర్ మోటూరు శ్రీరామకృష్ణ, బి.నాగేశ్వరరావు, పిఆర్ఒ జిఎస్.శివప్రకాష్ పాల్గొన్నారు.

## కొత్త ప్రభుత్వాలకు తెలుగు దండు స్వాగతాంజలి

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** కేంద్రంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరిన సందర్భంగా 'తెలుగుదండు' ఆధ్వర్యాన మద్దిలపాలెం కూడలి తెలుగుతల్లి విగ్రహం వద్ద "స్వాగతాంజలి" కార్యక్రమం నిర్వహించారు. పలువురు సాహితీవేత్తలు, భాషాభిమానులు కలిసి తెలుగుతల్లికి పుష్పాభిషేకం చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధినేతలు నరేంద్ర మోడీకి, చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ, మన రాష్ట్రంలో గత ప్రభుత్వం తెలుగుభాషను నాశనం చేసిందని, పోలవరాన్ని గాలిలో కలిపిందని, ప్రత్యేక హోదాను హుళ్లక్కి చేసిందని, సంక్షేమ పథకాల పేరుతో ఆంధ్రులను బిచ్చగాళ్లను చేసిందని విమర్శించారు. ఇప్పుడు మన రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ సారథ్యంలో కొలువుదీరిన ప్రభుత్వం తెలుగు భాష మనుగడకు పెద్దపీట వేయాలని, మాతృభాషాభిమానుల విన్నపాలు మన్నించి మాతృభాష రక్షణకు పటిష్టమైన చర్యలు తీసు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్య క్రమంలో ఆచార్య వెలగపూడి, డాక్టర్ డివి.సూర్యారావు, రాజమన్నార్, గంట్ల శ్రీనుబాబు, గంగరాజు హేమ, పైలా గీతిక, చిన సూర్య నారాయణ, డాక్టర్ కొచ్చెర్లకోట, ఆచార్య సూరప్పడు, మోహనరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిములకు నజీర్ బక్రీద్ శుభాకాంక్షలు



**ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ :** త్యాగనిరతి, శాంతి జీవనం, ప్రేమ, పరమత సహనానికి ప్రతీకైన బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండుగ జరుపుకుంటారని ఆయన వివరించారు. ముస్లిం సోదరులందరూ భక్తి శ్రద్ధలతో ఆనందంగా బక్రీద్ పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## తూర్పు టిడిపికి పట్టాభిరామ్ వెన్నెముక : వెలగపూడి



చోడె పట్టాభిరాం జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న వెలగపూడి

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** ఎంవిపి.కాలనీలోని ఉషోదయ జంక్షన్ వద్ద తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం 62వ జన్మ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు హాజరై మాట్లాడారు. విశాఖ తూర్పు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శాఖకు చోడె పట్టాభిరామ్ వెన్నెముక వంటి వారన్నారు. నియోజకవర్గంలో తన గెలుపు వెనుక చోడె పట్టాభిరాం ఉన్నారన్నారు. అతని అమూల్యమైన సేవలు పార్టీకి, నాయకులకు, కార్యకర్తలకు చాలా కీలకమన్నారు. ఎమ్మెల్యే సతీమణి వెలగపూడి సృజన మాట్లాడుతూ, తూర్పులో ఎమ్మెల్యేగా వెలగపూడి విజయం వెనుక పట్టాభిరాం కృషి చాలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు బైరెడ్డి పోతనరెడ్డి, తెడ్డు రాజు, తెడ్డు నూక రత్నం, గొలగాని పోలారావు, పీతల అమరేంద్ర, బొట్ట వెంకటరమణ, 17వ వార్డు నాయకులు చిన్నిపిల్లి నరేంద్ర, వాసు, శివ, ఆనంద్, శ్రీను, తారక్, బిసి నాయకులు ఆడారి కామేశ్వర రావు, కాళ్ల శంకర్, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం చోడె పట్టాభిరామ్ మాట్లాడుతూ, తనకు శుభాకాంక్షలు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**శుభాకాంక్షలు తెలిపిన పుక్కళ్ల ధనలక్ష్మిశంకర్**

చోడె వెంకట పట్టాభిరామ్ జన్మదినం సందర్భంగా 18 వార్డు కార్పొరేటర్ పుక్కళ్ల ధనలక్ష్మి, శంకర్ దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## 'ఎయు వీసీని విచారణ కన్నా ముందే తప్పించాలి'

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి అవినీతి అక్రమాలు, నియంతృత్వ పాలనపై నూతన ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణకు కమిటీని ఏర్పాటుచేయడం హర్షించదగిన విషయమని ఆంధ్రా యూనివర్సిటీ ప్రోగ్రెసివ్ ఫోరమ్ కన్వీనర్ డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీసీ ప్రసాదరెడ్డి విధుల్లో ఉండగా నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా విచారణ జరగుతుందా? అని యూనివర్సిటీలో వివిధ ప్రజాసంఘాలు, మేధావుల ఆందోళన చెందుతున్నారని తెలిపారు. విచారణ కమిషన్ రాకముందే వీసీ పదవి తొలగించి విచారించాలని కోరారు.

# విశాఖలో మేక్ మై ట్రిప్ సంస్థ ఏర్పాటు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** రామ్ నగర్ వుడా కాంప్లెక్స్ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన టూరిజం యాప్ మేక్ మై ట్రిప్ సంస్థ కార్యాలయాన్ని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆదివారం ప్రారంభించారు. ఎపి టూరిజం డెవలప్‌మెంట్‌లో భాగంగా నూతన ట్రావెల్ ప్యాకేజీలు, విదేశీ పర్యటనల సమాచారం గురించి ఆయన మాట్లాడుతూ, విశాఖకు ఇది ఒక కొత్త సౌకర్యం అన్నారు. మేక్ మై ట్రిప్ ద్వారా విశాఖ ప్రజలు ఆన్ లైన్‌తో పాటు ఇప్పుడు ఆఫ్ లైన్ విధానంలో కూడా టూర్స్ బుకింగ్ చేసుకునే సౌలభ్యకుందన్నారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు ప్రాంతీయ కార్యాలయం విశాఖలో ఏర్పాటుచేశారని తెలిపారు. ఈ సంస్థ కార్యకలాపాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, టూరిజం బాగా అభివృద్ధి చెందిన తరుణంలో ఇటువంటి సంస్థలు ఎంతయినా అవసరం అన్నారు. సంస్థ ఫ్రాంచైజీ కార్యాలయం మేనేజింగ్ డైరెక్టర్ సతీష్ ఆకార్ మాట్లాడుతూ, ఐదేళ్లలో ట్రావెలింగ్ పెరిగిందన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు వస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ విమాన సర్వీసులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆఫ్ లైన్ బుకింగ్ వల్ల కుటుంబ సభ్యులు అవసరాలకు అనుగుణంగా ట్రావెల్ ప్యాకేజీ బుకింగ్స్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రపంచంలో 176 దేశాలకు టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్థ అసోసియేట్ డైరెక్టర్ మనీష్ భారతి, మేక్ మై ట్రిప్ అధికారి వైభవ్, విశాఖ బ్రాంచ్ మేనేజర్ బబిత పాల్గొన్నారు.



మేక్ మై ట్రిప్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న గణబాబు

# నిరుపయోగంతో... శిథిలావస్థకు..!



సీతంపేటలో శిథిలమైన ఆర్‌అండ్‌బి క్వార్టర్లు

- ఆకతాయిలకు అడ్డాగా ఆర్‌అండ్‌బి క్వార్టర్స్
- అవస్థలు పడుతున్న ప్రజలు.. పట్టని అధికారులు
- నగరం నడిబొడ్డున ఉన్నా నిర్వహణలో నిర్లక్ష్యం
- డంపింగ్ యార్డుగా మారి, దుర్వాసనతో ఇక్కట్లు

**ప్రజాశక్తి- సీతమ్మధార :** నగరంలోని సీతంపేట, సీతమ్మధారలోని ఆర్‌అండ్‌బి క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్నేళ్లుగా వీటిని నిరుపయోగంగా వదిలేయడం, సంబంధిత శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో సలక్షణంగా ఉన్న క్వార్టర్సు పాడవ్వడమే కాకుండా, నేడు మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారాయని స్థానికులు ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నగరం నడిబొడ్డున సీతంపేట, రాజేంద్రనగర్ లోనూ, సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం పక్కన ఆర్‌అండ్‌బి క్వార్టర్స్ ఉన్నాయి. జివిఎంసి 20వ వార్డులో సీతంపేటలోనిఆర్ అండ్ బి క్వార్టర్స్‌లో పూర్తిగా ఎవరూ లేకపోవడంతో క్వార్టర్స్ శిథిలా వ్యవస్థకు చేరుకున్నాయి.నిండా పిచ్చిమొక్కలు పేరుకుపోయి, అధ్వానంగా, ప్రమాదభరితంగా తయారయ్యాయి. ప్రస్తుతం ఇవి డంపింగ్‌యార్డుగా మారిపోయాయని స్థానికులు అంటున్నారు. కొన్నేళ్లుగా వీటి ఆలనాపాలనా పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితికి చేరుకున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నాయి. శిథిలమై, నిరుపయోగంగా మారిన ఈ క్వార్టర్స్ ఇపుడు గంజాయి, మద్యం తాగే మందుబాబులకు, ఆకతాయిలకు



శిథిలమైన క్వార్టర్స్‌లో వేసిన చెత్తాచెదారం

నిలయంగా మారాయని స్థానికులు అంటున్నారు. అటుగా స్థానికులు, పాదచారులెవరైనా వెళితే మత్తులో ఉండే మందుబాబులు, ఆకతాయిల చేష్టలు, ఆగడాలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం పక్కన ఉన్న క్వార్టర్స్‌లో కొంతమంది ఉంటున్నప్పటికీ, మరికొన్ని ఖాళీగా ఉండడంతో రాత్రి వేళల్లో వాటిల్లో మందుబాబులు చేరి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్కడున్నవారితోపాటు అటుగా వెళ్లేవారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడేళ్లుగా నిర్లక్ష్యంగా వదిలేయడం వల్లే వీటి పరిస్థితి ఇలా మారిందని, ఇప్పటికైనా సంబంధిత ఆర్ అండ్ బి శాఖ అధికారులు స్పందించి, పాడైన క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయడమో, లేకుండా పునర్నిర్మించడం ద్వారా వినియోగంలోకి తెచ్చే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. లేకుంటే వీటిని ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగించే దానిపై ఆలోచన చేయాలని కోరుతున్నారు. మరోవైపు శిథిలమై, ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌లో మద్యం, గంజాయి మత్తులో ఉండే మందుబాబులు చేసే ఆగడాలపై పోలీసులు ఒక కన్నేసి, ఆకతాయిల చేష్టల నుంచి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

### ఆకతాయిలకు అడ్డాగా మారాయి

మూడేళ్లుగా సీతంపేటలోని ఆర్‌అండ్‌బి క్వార్టర్స్‌లో ఎవరూ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుని, ఆకతాయిలకు నిలయంగా మారాయి, మద్యం మత్తులో రెచ్చిపోతున్న మందుబాబుల ఆగడాలను అరికట్టే చర్యలు చేపట్టాలి.

**- ఎస్ వెంకటరమణ, స్థానికుడు**

### డంపింగ్ యార్డుగా మారినా పట్టించుకోరేం

ఆర్‌అండ్‌బి క్వార్టర్స్ ఖాళీగా ఉండడంతో చెత్తాచెదారాన్ని డంపింగ్ చేస్తున్నారు. దీంతో దుర్వాసనతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థిత ఉంది.శిథిలావస్థకు చేరిన ఆర్‌అండ్‌బి క్వార్టర్స్‌పై సంబంధిత అధికారులు దృష్టి పెట్టి తగు చర్యలు చేపట్టాలి.

**- శేఖర్, వాహనదారుడు**

## తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చిన సుసర్ల

### గోపాలశాస్త్రి శతజయంతిలో పలువురు ప్రముఖులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

**ప్రజాశక్తి- సీతమ్మధార :** సుసర్ల గోపాలశాస్త్రి ఎంతో మహోన్నత వ్యక్తి అని, ఒకవైపు సివిల్ ఇంజనీరింగ్‌గా విధులు నిర్వహిస్తూనే సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలకు వన్నె తెచ్చారనిడాక్టర్ కొలవెన్న మలయవాసిని కొనియాడారు. ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో డాక్టర్ సుసర్ల గోపాలశాస్త్రి శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గోపాలశాస్త్రి తనయుడు సుసర్ల రాంగోపాల్ రచించిన సీతారామం భజ మహం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షులు డాక్టర్ గండికోట రఘురామారావు మాట్లాడుతూ సుసర్ల గోపాలశాస్త్రి పేరిట ఆయన కుమారుడు సుసర్ల రామగోపాల్ పుస్తకం రచించడం చాలా ఆనందంగా ఉందని, విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. సర్క్యూట్‌హౌస్ వద్ద మాజీ ప్రధానమంత్రి పివి.నరసింహారావు విగ్రహప్రతిష్టలో గోపాలశాస్త్రి కీలకపాత్ర వహించారన్నారు. తండ్రి బాటలోనే కుమారుడు రామ్‌గోపాల్ నడవటం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పేరి రవికుమార్, పుస్తక రచయిత సుసర్ల రామ్‌గోపాల్, పలువురు కవులు రచయితలు పాల్గొన్నారు.

## ఘనంగా పట్టాభిరాం జన్మదిన వేడుకలు



శుభాకాంక్షలు చెబుతున్న కిశోర్‌కుమార్

**ప్రజాశక్తి- సీతమ్మధార :** తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, జివిఎంసి మాజీ ఫ్లోర్‌లీడర్ చోడే వెంకట పట్టాభిరామ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను 26 వ వార్డు టిడిపి ప్రెసిడెంట్ ముక్క కిశోర్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా ఆలయ తృతీయ వార్షికోత్సవం

**ప్రజాశక్తి-పెందుర్తి** : పెందుర్తి వెంకటాద్రి కొండపై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ తతీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఆలయ ధర్మకర్త శరగడం చిన్న అప్పలనాయుడు అనురాధ దంపతుల ఆధ్వర్యంలో స్వామి కల్యాణం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా, కమనీయంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త చిన అప్పలనాయుడు మాట్లాడుతూ ఏటా ఆనవాయితీగా నిర్వహించే ఈ వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు.

## ఉచిత హోమియో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న హోమియో వైద్యులు

**ప్రజాశక్తి -భీమునిపట్నం** : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నబజారులోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. వైద్యులు టి జగన్నాథరావు, టిజె మోహన్ పాల్గొనిసుమారు వంద మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్‌ఎన్ మూర్తి, కె చంద్రశేఖర్, కెవి భానోజీరావు పాల్గొన్నారు

## ప్రజల ఆదరాభిమానాలు మరువలేనివి

- అన్నవరం విజయోత్సవ సభలో ఎమ్మెల్యే గంటా



ఆనందపురం జంక్షన్‌లో ఎమ్మెల్యే శ్రీనివాసరావును సత్కరిస్తున్న కూటమి నేతలు

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** తన పట్ల నియోజక వర్గ ప్రజలు చూపిన ఆదరాభిమానాలు మరువ లేనివని ఎమ్మెల్యే గంటాశ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని అన్నవరం, పెద నాగ మయ్యపాలెం గ్రామాల్లో టిడిపిశ్రేణులతో కలిసి విజయోత్సవ సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాను పోటీ చేసిన నియోజకవర్గంలో ఎప్పుడూ పోటీ చేయరన్న అపవాదును శాశ్వతంగా చెరిపేయాలనే బలమైన సంకల్పంతో భీమిలి నుంచే ఎన్నికల్లో పోటీకి దిగి, మీ అందరి ఆశీస్సులతో ఘన విజయం సాధించినట్లు గంటా తెలిపారు. ఎన్నికల ప్రచారాన్ని ఇదే అన్నవరం గ్రామం నుంచి ప్రారంభించి రాష్ట్రంలోనే రెండో అత్యధిక మెజారిటీ 92,401 ఓట్ల తేడాతో గెలుపు సాధించినట్లు తెలిపారు. ఈ విజయం భీమిలి ప్రజలకే అంకితమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు డిఎవన్ రాజు, నాయకులు సరగడ అప్పారావు, గాడు వెంకటప్పడు, వై అనిల్‌ప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, గాడు తాతినాయుడు, స్థానిక పార్టీ నాయకులు లక్ష్మణరావు పాల్గొన్నారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు గంటాకు ఘన స్వాగతం పలికారు.

### గంటాకు ఘన స్వాగతం

**ఆనందపురం :** భీమిలి నియోజకవర్గంలో కూటమి బలపరచిన తెలుగుదేశం అభ్యర్థిగా విజయం సాధించిన తర్వాత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం సాయంత్రం భీమిలి నియోజకవర్గంలోని అన్నవరం గ్రామంలో పర్యటించారు. అన్నవరంలో విజయోత్సవ ర్యాలీ నుంచి తిరిగొచ్చిన ఆయనను ఆనందపురం జంక్షన్ వద్ద కూటమి పార్టీకి చెందిన మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికి, పూలమాలలతో సత్కరించారు. పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా వాహనం నుంచి దిగిన గంటా శ్రీనివాసరావు అక్కడి నేతలకు అభివాదం చేయడంతోపాటు కాసేపు ముచ్చటించారు.

## 'మిణుగురులు' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



మిణుగురులు ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న నాగరాణి

**ప్రజాశక్తి -భీమునిపట్నం** : మండలంలోని రేఖవానిపాలెం పంచాయతీ, ఎల్లమ్మపేట గ్రామంలో మిణుగురులు పిల్లల ప్రత్యేక సంచికను వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విసిసి జిల్లా కమిటీ సభ్యులు కె నాగరాణి, స్థానికులు ఎస్ గుణ, సాయి, రాఘవి, భాను పాల్గొన్నారు

ఘనంగా గురురాజ సంగీత శిక్షణాలయం

# దశమ వార్షికోత్సవం



వెంకటరమణను సత్కరిస్తున్న వీరరాజు, అతని స్నేహితులు

**ప్రజాశక్తి -తగరపువలస** : స్థానిక శ్రీ గురురాజ సంగీత శిక్షణాలయం వ్యవస్థాపకులు విజినిగిరి సంతోష్‌కుమార్‌ఆధ్వర్యంలో శిక్షణాలయం దశమ వార్షికోత్సవం చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు.. ముఖ్య అతిథిగా హాజరైన భీమిలి యోగా చైతన్య సంస్థ డైరెక్టర్ సిహెచ్ వెంకటరమణ మాట్లాడుతూ, సంగీతం ద్వారా మానసిక ఉల్లాసం, ఉత్సాహం, ఆరోగ్యం సమకూరుతాయన్నారు. అనేక మానసిక రుగ్మతల నిర్మూలించడానికి దోహద పడుతుందన్నారు. శాస్త్రీయ సంగీతాన్ని ఉపాధి మార్గంగా ఎంచుకునే వారికి గురురాజ సంగీత శిక్షణాలయం ద్వారా ఎంతోమందికి శిక్షణ ఇవ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు. శిక్షణాలయం ద్వారా శిక్షణ పొందిన వారు దాదాపు ఏడు రాష్ట్రాల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో తెలుగు పద్యకవి బులుసు వేంకటేశ్వర్లు, శిక్షణాలయం వ్యవస్థాపకులు వీర రాజు, స్నేహితులు భీమసేన్ రావు, హేమారావు, మధుసూధనరావు, అతని సోదరుడు రాజశేఖర్ పాల్గొన్నారు. శిక్షణాలయం ప్రారంభం నుంచి అన్ని విధాలా తోడ్పాటు అందించిన మందరపు చంద్రశేఖర్‌ను వీర రాజు ప్రత్యేకంగా అభినందించారు

## బాధిత కుటుంబానికి నిత్యావసరాలు




జయశంకర్‌కు నిత్యావసరాలు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

**ప్రజాశక్తి -తగరపువలస** : జివిఎంసి రెండో వార్డు సత్యనారాయణపేటకు చెందిన బి జయశంకర్ అనే నిరుపేద కుటుంబానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సతీమణి శారద తన సొంత నిధులతో సమకూర్చిన నెలకు సరిపడా నిత్యావసర సరుకులను గంటా శారద హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛందసంస్థ ప్రతినిధి వి శ్రీనివాసరెడ్డి ఆదివారం అందజేశారు.ఇటీవల ప్రారంభించిన సంస్థ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగానే పేద కుటుంబానికి ఈ మేరకు సాయం చేసినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తూ, ఇటీవలరోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై అనారోగ్యంతో బాధపడుతున్న జయశంకర్‌కు ఈ మేరకు సాయం అందజేశారు. కార్యక్రమంలో జి ప్రసాద్ పాల్గొన్నారు.

## బిసిజి వ్యాక్సిన్ వేయించుకోవాలి

**ప్రజాశక్తి -మధురవాడ** : క్షయవ్యాధి రహిత భారత్ లక్ష్యంగా టిబి నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న ఉచిత బిసిజి వ్యాక్సినేషన్‌ను సోమవారం నుంచి గురువారం వరకు మధురవాడ, ఆనందపురం పిహెచ్‌సిల పరిధిలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో, వెల్‌నెస్ సెంటర్లల్లో వేయనున్నటు వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి తెలిపారు. మధురవాడ టిబి యూనిట్ పరిధిలోని సాగర్‌నగర్, రుషికొండ, పిఎంపాలెం, వాంబే కాలనీ, స్వతంత్రనగర్, మిధిలాపురి వుడాకాలనీ, విశాలాక్షినగర్, మారికవలస, బక్కన్నపాలెం తదితర ప్రాంతాల్లోని యుపిహెచ్‌సిల్లోనూ ఉచిత బిసిజి వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని టిబి విభాగం, సీనియర్ ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం తెలిపారు. క్షయవ్యాధి వ్యాధి సోకిన వారితో సన్నిహితంగా ఉండే వారు కూడా వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు.

# సిఐటియు ఉద్యమాల్లో కూన కీలకపాత్ర

- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ , ఇతర నేతలు
- సత్యనారాయణ, పార్వతి దంపతులకు సత్కారం

**ప్రజాశక్తి -మాధవధార / కలెక్టరేట్** : విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ప్రయివేటుపరంగా కాకుండా, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మూడు దశాబ్దాలుగా విశాఖ పోర్టులో నిర్వహిస్తున్న అనేక ఉద్యమాల్లో కూన సత్యనారాయణ కీలకపాత్ర పోషించారని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. విశాఖ పోర్టు అథారిటీలో లస్కర్ గ్రేడ్-1గా విధులు నిర్వర్తించి, ఇటీవలే ఉద్యోగ విరమణ చేసిన కూన సత్యనారాయణ, పార్వతి దంపతులను ఆదివారం మాధవధారలోని మాధవస్వామి కల్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, ఉత్తరాంధ్ర అభివద్ధి వేదిక కార్యదర్శి ఎ.అజశర్మ, జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, మాట్లాడుతూ మాధవధారలో విద్యార్థిగా ఉన్నప్పటి నుండే కూన సత్యనారాయణ ప్రజా సమస్యల మీద నిరంతరం పని చేశాడని, విశాఖ పట్నం పోర్ట్ ట్రస్ట్‌లో ఉద్యోగంలో చేరాక, కార్మికుల సమస్యలపై సిఐటియు సంఘంలో చేరి నిరంతరం పనిచేశారన్నారు. విధుల్లో అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నా, విశాఖపట్నం పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు. యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నా రన్నారు. పోర్టు యాజమాన్యం ఆయనను సస్పెండ్ చేసినా,వెనుకడుగు వేయకుండా కార్మికుల సమస్యల మీద పెద్ద ఎత్తున పోరాడారని గుర్తు చేశారు. మాధవధార ప్రాంతంలో ఏ చిన్న సమస్య వచ్చినా సత్యనారాయణ తన శక్తి మేరకు వాటి పరిష్కారానికి కృషి చేసేవారన్నారు. 50,51 వార్డుల్లో వార్వా అపార్ట్‌మెంట్ల సమస్యలపై ఉద్యమాలు చేశారన్నారు. ఈ రకంగా సత్యనారాయణ పనిచేయడానికి అతని భార్య పార్వతి, కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు ఎంతో ఉన్నాయన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం తన ఆరోగ్యాన్ని చూసుకుంటూ ప్రజాసమస్యలపై పనిచేయాలని కోరారు.



సత్కార సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

యునైటెడ్ పోర్ట్‌అండ్‌డాక్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వి.ఎస్ పద్మనాభరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాధవధార స్నేహబంధం, బంధువులు, మిత్రులు ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, సిఐటియు నాయకులు బి జగన్, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, డాక్ లేబర్ బోర్డు కార్యదర్శి లక్ష్మణరావు, 50వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సనపల వరప్రసాద్, మాధవ యువజన సమాజం అధ్యక్షులు సనపల రామ్ గోపాలరావు, మాధవ యువజన సమాజం సహాయ కన్వీనర్ పప్పల రామచంద్రరావు, టిడిపి, సిపిఎం, వైసిపి నేతలు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

## సిపిఎం నగర కమిటీకి రూ.లక్ష విరాళం



సిపిఎం నేతలకు చెక్కు అందజేస్తున్న సత్యనారాయణ దంపతులు

విశాఖపట్నం పోర్టు అథారిటీలో లస్కర్ గ్రేడ్ -1గా ఉద్యోగ విరమణ చేసిన కూన సత్యనారాయణ, పార్వతి దంపతులు సిపిఎం నగర కమిటీకి రూ.లక్ష విరాళాన్ని ఆదివారం ఇచ్చారు. ఈ మేరకు సిఐటియు నాయకులు ఆర్‌కెఎస్‌వి కుమార్, బి జగన్, బొట్టా ఈశ్వరమ్మలకు చెక్కును అందజేశారు.

# సమ న్యాయంతో మానవ హక్కుల పరిరక్షణ

- డిఎస్ఎన్‌యు ప్రథమ ఉపకులపతి సత్యనారాయణ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

**ప్రజాశక్తి- సీతమ్మధార** : గ్రామాలలో కుల, సామాజిక, లింగ వివక్షతో మహిళా వివక్షతపై మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు దృష్టి సారించాలని దామోదరం సంజీవయ్య నేషనల్ యూనివర్శిటీ ప్రథమ ఉపకులపతి ప్రొఫెసర్ వై సత్యనారాయణ అన్నారు. ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మానవ హక్కుల కౌన్సిల్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ అధ్యక్షతన మానవహక్కులపై రూపొందించిన లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికీ గ్రామాలలో హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, సమాన న్యాయం జరిగినప్పుడే హక్కుల పరిరక్షణ సాధ్యమన్నారు. సభకు అధ్యక్షత వహించిన కౌన్సిల్ కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులంతా చట్టాల పట్ల, మానవ హక్కుల పట్ల అవగాహన కలిగి, సమాజంలో వాటి ఉల్లంఘనలపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేయాలని సూచించారు.విశ్రాంత ఎఎస్‌పి ఎస్ దివాకర్, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెవరా సత్యనారాయణ తదితరులు షార్ట్ ఫిలిమ్స్ తిలకించి, సమీక్ష చేశారు. ప్రదర్శించిన మూడు షార్ట్ ఫిలిమ్స్ జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ బహుమతులు పొందాయని తెలిపారు. కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు ఎస్‌వి.రమణ స్వాగతోపన్యాసం చేయగా, డాక్టర్ వాసిని వందన సమర్పణ చేశారు కార్యక్రమంలో కౌన్సిల్ ప్రతినిధులు వివిఎస్ మూర్తి, సాగర్ అప్పారావు, అబ్దుల్, రెడ్డి మాట్లాడారు.

## జిప్సా అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



భాస్కరరావును సత్కరిస్తున్న జిప్సా ప్రతినిధులు

**ప్రజాశక్తి -గాజువాక** : గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం(జిప్సా) అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు జన్మదిన వేడుకలను చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో జిప్సా సభ్యులు సమక్షంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా భాస్కరరావుకు జిప్సా సంఘ సభ్యులు పుష్పగుచ్ఛాలు అందించియిచ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిప్సా ప్రధాన కార్యదర్శి గిరీష్ శ్రీనివాస్, కోశాధికారి డి శ్రీనివాసరావు, అప్సా రాష్ట్ర నాయకులు పొన్నాడ వాసుదేవరావు, మరిశర్ల సత్యనారాయణ, జిప్సా నాయకులు పి మురళీసుందర్, చంద్రమౌళి, రవికుమార్, వెంకు నాయుడు, రాము పాల్గొన్నారు.

# సామాజిక సేవల్లోనూ సిఐటియు

- 4న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం

**ప్రజాశక్తి- సీతమ్మధార** : కార్మికుల సమస్యలు, హక్కులపై పోరాటంలోనే కాదు, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ సిఐటియు ముందువరుసలో ఉంటుందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ అన్నారు. వచ్చేనెల 4న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆదివారం చిట్టిబాబు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సిఐటియు అక్కయ్యపాలెం జోన్ కమిటీ సమావేశం కెఎస్. కుమార్ అధ్యక్షతన జరిగింది వివిధ రంగాల నుండి 22 మంది ప్రతినిధులు హాజరైన సమావేశంలో ముందుగా అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.తులసి, సిఐటియు తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి రాజు లోవ మృతికి సంతాపం తెలిపి, నివాళులర్పించారు. అనంతరం అక్కయ్యపాలెం జోన్ పరిధిలో చేపట్టిన పోరాటాలు, ఎన్నికల సమయంలో చేసిన కార్యక్రమాలు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై కార్యదర్శి ఎన్ ప్రకాశరావు వివరించారు. ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి. కుమార్, కార్మికుల సంక్షేమానికి సిఐటియు చేస్తున్న కృషి, పోరాటాలను వివరించారు. జులై, ఆగస్టు నెలల్లో ఎక్కువ మందిని యూనియన్‌లో సభ్యులుగా చేర్పించాలని సూచించారు.


**అక్కయ్యపాలెం జోన్ కమిటీ నూతన కార్యవర్గం**

అనంతరం సిఐటియు అక్కయ్యపాలెం జోన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.అధ్యక్షునిగా. కె స్వతంత్ర కుమార్, ఉపాధ్యక్షునిగా వి బాబ్జీరావు, గౌరీశ్, నీలకంఠం. కార్యదర్శిగా ఎన్ ప్రకాశరావు, సహాయ కార్యదర్శులుగా. యుఎస్ఎన్ రాజు, జి.అప్పలరాజు,శంకర్, బి లక్ష్మి నారాయణ, కోశాధికారిగా బి. లక్ష్మీపతిలను ఎన్నుకున్నారుఉ. సమావేశంలో సిహెచ్. త్రినాధరావు, గౌరీశ్, యుఎస్ఎన్ రాజు, జి.అప్పలరాజు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిఐటియు నాయకులు కుమార్

# ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన హోంమంత్రి అనిత



హోంమంత్రి అనితను సత్కరిస్తున్న కొణతాల తదితరులు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

**రాష్ట్ర హోంశాఖ మంత్రికి బాధ్యతలు చేపట్టిన వంగలపూడి అనిత ఆదివారం జిల్లాలోని పలువురు ఎన్‌టిఎ కూటమి ఎంపీ, ఎమ్మెల్యేలను కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రి అనితను ఘనంగా సత్కరించారు.**

**కొణతాలను కలిసిన అనిత**

**అనకాపల్లి :** పట్టణంలోని రింగ్ రోడ్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొణతాల అనితని సత్కరించారు. జిల్లాలో సమస్యలు, చేపట్టాల్సిన చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై వారిద్దరూ చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, టిడిపి నేత మల్ల సురేంద్ర పాల్గొన్నారు.

**మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందను..**

గవరపాలెంలోని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ కార్యాలయానికి రాష్ట్ర మంత్రి వంగలపూడి అనిత ఆదివారం విచ్చేశారు. ఆమెకు పీలా గోవింద, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు బాలాజీ, బిఎస్ఎన్ఎ.జోగినాయుడు పాల్గొన్నారు.

**ఎంపీ సిఎం. రమేష్‌ను...**


అనకాపల్లి బైపాస్ రోడ్డు బిజెపి కార్యాలయంలో ఆదివారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ని మంత్రి వంగలపూడి అనిత మర్యాదపూర్వకంగా కలిశారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఇద్దరూ చర్చించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

**గంటా శ్రీనివాసరావును..**

**ఎంవిపి కాలనీ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం మధ్యాహ్నం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఎంవిపి కాలనీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు గంటా శ్రీనివాసరావు, ఆయన తనయుడు గంటా రవితేజ శుభాకాంక్షలు తెలిపారు.

**అనితను సత్కరించిన గండి బాబ్జి**

**విశాఖ కలెక్టరేట్ :** రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి ఆమెను శాలువాతో కప్పి పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందించారు.



పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కలిసిన మంత్రి అనిత

**పంచకర్లతో అనిత భేటీ**

**పెందుర్తి :** అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదివారం సాయంత్రం సీతమ్మధారలోని ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా జనసేన అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఇంటికి విచ్చేశారు. ఈసందర్భంగా హోంమంత్రి అనితను పంచకర్ల రమేష్‌బాబు సతీసమేతంగా ఘన స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై నేతలిద్దరూ చర్చించుకున్నారు.

**హోంమంత్రి అనితను కలిసిన వెంకటరమణ**

**బుచ్చయ్యపేట :** మండలంలోని కోవిలపల్లి మాజీ సర్పంచ్ సీతా వెంకటరమణ ఆదివారం రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను నక్కపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు తమ గోడు వెల్లబుచ్చుతున్న వాలంటీర్లు

## న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు వాలంటీర్ల వినతి

ప్రజాశక్తి- అచ్యుతాపురం

ఎలమంచిలి మున్సిపాలిటీలో పనిచేసి వైసిపి నాయకుల ఒత్తిడితో రాజీనామా చేసిన వాలంటీర్లు ఆదివారం యలమంచిలి నూతన ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను కలిశారు. తమకు కొత్త ప్రభుత్వంలో తిరిగి వాలంటీర్లుగా నియమించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పెదపాడు గ్రామానికి ఆదివారం ఎమ్మెల్యే విచ్చేసిన సందర్భంగా వాలంటీర్లు అతనిని కలిశారు. ఈ సందర్భంగా వారు తాము ఐదు సంవత్సరాల పాటు ప్రజలకు ప్రభుత్వానికి సేవలు అందించామని, వైసిపి నాయకుల బలవంతంగా తమతో రాజీనామాలు చేయించారని తెలిపారు. తమ తప్పును మన్నించి తిరిగి వాలంటీర్లుగా తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే విజయకుమార్ ఎన్నికల ప్రచారంలో ఏ వాలంటీరు రాజీనామా చేయవలసిన అవసరం లేదని ముందుగానే చెప్పామని, అయినప్పటికీ రాజీనామాలు చేశారని, నేను చేసేది ఏమీ లేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

**ఎంపీని కలిసిన మాజీ సైనికులు**

**ప్రజాశక్తి-అనకాపల్లి :** రాష్ట్ర సైనిక్ సెల్ కో కన్వీనర్ అగ్గాల హనుమంతరావు ఆధ్వర్యంలో మాజీ సైనికులు ఆదివారం అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్‌ని ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా మాజీ సైనికులు ఉపాధ్యక్షులు నారిపల్లి సత్యారావు, కోశాధికారి ఎస్ వరప్రసాద్ మాట్లాడుతూ తమ సమస్యలపై వైసిపి ప్రభుత్వం స్పందించలేదని, ఇప్పటి కూటమి ప్రభుత్వం తొందరగా అడుగులు వేయాలని కోరారు. దీనిపై ఎంపీ సిఎం రమేష్ సానుకూలంగా స్పందించారు.

**ఎమ్మెల్యే కొణతాలకు సత్కారం**

**ప్రజాశక్తి-అనకాపల్లి :** అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదివారం తెలుగుదేశం పార్లమెంటు కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో కొణతాలను ఘనంగా సత్కరించారు. ముందుగా టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి భారీ గజమాల వేసి జోహార్లు అర్పించారు. అనంతరం పట్టణ టిడిపి అధ్యక్షులు డాక్టర్ కెటివి.నారాయణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొణతాల రామకృష్ణను గజమాలతో సత్కరించారు.

**మెగా రక్తదాన శిబిరం**

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక లోటస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా శ్రీగౌరీ గ్రంథాలయంలో ఎఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ వైడిఎస్ మూర్తి, ఎస్జి గ్రూప్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, కాండ్రేగుల వెంకటరమణ, మల్ల బాబు నాయుడు పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విల్లూరి రాజేష్, కాండ్రేగుల జగన్నాధరావు, మారిశెట్టి భాస్కర్ రావు, వేదిర సంతోష్, కోరుబిల్లి రేవంత్, ఆళ్ల ప్రభాత్, పెంటకోట సురేష్, పీల నాయుడు, భీశెట్టి తిరుమల, ఇల్లూరి శ్రీమన్, ఆళ్ల సంతోష్, అప్పలనాయుడు, కర్రి గంగాధర్, సూరిశెట్టి నాగు, 40 మందిపైగా రక్తదాతలు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు



ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న సుగర్ ఫ్యాక్టరీ యూనియన్ నేతలు

## సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధికి త్వరలో అఖిలపక్షం

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి కోసం త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. సుగర్ ఫ్యాక్టరీ గుర్తింపు యూనియన్ ప్రతినిధులు, సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే రాజును మర్యాదపూర్వకంగా కలిసి ఘన విజయం సాధించడం పట్ల అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోడవరం చక్కర కర్మాగారాన్ని పూర్వవైభవం తీసుకురావడానికి, ఫ్యాక్టరీ అభివృద్ధికి ప్రభుత్వం పరంగా ఆర్థిక సాయానికి తన శక్తివంతం లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ నాయకులు కే భాస్కర్ రావు, అల్లం రామ అప్పారావు, తలారి సత్యనారాయణ, ఏడువాక నారాయణరావు, హరిహరరావు, శ్రీను శ్యాం, సంతోష్, రామకృష్ణంరాజు, దుస్సు రమణ, వసాది రమణ, భాస్కర్, పెంటా రావు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు స్టీల్ క్యారేజీలు పంపిణీ**

**ప్రజాశక్తి-అనకాపల్లి :** ఈనాడు పత్రిక అధినేత కీర్తిశేషులు రామోజీరావు జ్ఞాపకార్థం పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ నిర్వాహక సంస్థ వ్యవస్థాపకులు పిఎంఎల్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం పేద విద్యార్థులకు స్టీల్ క్యారేజీలు పంపిణీ చేశారు. స్థానిక వరలక్ష్మి కిరాణా స్టోర్స్ అధినేత ఆర్థిక సహాయంతో వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మేనేజర్ వాడపల్లి కుమార్, కే శేషు కుమార్, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి, మాజీ అధ్యక్షురాలు మంజు భార్గవి పాల్గొన్నారు.

**యోగా గురువుకు సత్కారం**

**ప్రజాశక్తి-అనకాపల్లి :** తల్లిదండ్రుల తర్వాత అంతటి ప్రాముఖ్యత గురువుకే ఉందని తుమ్మపాల శ్రీకృష్ణ యోగ సెంటర్ వ్యవస్థాపకులు బుదిరెడ్డి నరసింగరావు అన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా ఆదివారం ఆయన వద్ద ఈత, యోగ అభ్యాసన చేస్తున్న విద్యార్థులు నరసింగరావు నాగమణి దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు.

## ప్రజలకు మంచి జరిగేలా విధులు నిర్వహించాలి

### అధికారులను ఆదేశించిన రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత




మంత్రి అనితకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ రవి, చిత్రంలో ఎస్‌పి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజలకు మేలు జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. జిల్లా అధికారులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అదృశ్యం కేసులపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు తగిన న్యాయం చేస్తామని చెప్పారు. గ్రామాలలో సమస్యలు ముఖ్యంగా పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలు, ఇరిగేషన్ శాఖల్లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. ప్రభుత్వ విధి విధానాలకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. ముందుగా మంత్రి అనితను జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ, జిల్లా అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## తూర్పు కాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా తూర్పు కాపు టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2023- 2024 పదవ తరగతిలో 550 మార్కులు పైన పొందిన తూర్పు కాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారం, స్కాలర్ షిప్‌లను జివిఆర్ రెసిడెన్సీలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి మాట్లాడుతూ విద్యా విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ఎలా సంసిద్ధులు కావాలో తెలియజేశారు. విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలన్నారు. వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల లక్ష్యానికి పదవ తరగతి మొదటి మెట్టు అని, లక్ష్యసాధనకు అనుగుణంగా మెలగాలని, ఎటువంటి సహాయం కావాలన్నా తాను ముందుండి అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో 82వ వార్డు కార్పొరేటర్ జాజుల లక్ష్మీ ప్రసన్నా రమేష్, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, తూర్పు కాపు సంఘం అధ్యక్షులు పలకా రాము, ఉపాధ్యాయ సంస్థల అధినేత రమణాజీ, సరస్వతి విద్యాసంస్థల అధినేత సుంకర శ్రీనివాసరావు, ఇతర కాపు పెద్దలు పాల్గొన్నారు.



టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం



ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నూతన కార్యవర్గ సభ్యులు

### రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : భారత రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ తమ సంస్థ నాయకులకు పిలుపునిచ్చారు. ఐక్యవేదిక మండల కమిటీ సమావేశం ఆదివారం దేవరాపల్లిలో జరిగింది. కెవి.రమణ ఆధ్వర్యాన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి ఆదిరెడ్డి చిన్న కన్నబాబు, త్రినాధ్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జిలాని, అన్వర్, వలి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. ఐక్యవేదిక మండల అధ్యక్షునిగా పోతల చిన్నప్పలనాయుడు (అడ్వకేట్), కార్యదర్శిగా రొంగలి సత్యం (ఉపాధ్యాయుడు), కోశాధికారిగా బడబల్ల సత్యం, ఉపాధ్యక్షుడిగా డి.వెంకటపతిరాజు, సహాయ కార్యదర్శులుగా రధి వెంకటరావు, గంగవంశం సంతోష్, గంగవంశం రజిని, సిహెచ్.పెద్దినాయుడు, గండిపడాల మధు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కెవి.రమణ నూతన కమిటీకి దిశ నిర్దేశం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలని సూచించారు. సమాచారం హక్కు చట్టంపై అవగాహన కల్పించాలని, ప్రతి గ్రామంలో గ్రామసభలు సక్రమంగా జరిగేటట్లు చూడాలని కోరారు. నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

### చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి -అనకాపల్లి : మండలంలోని తుమ్మపాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం వచ్చినా వికలాంగులు, వయోవృద్ధులకు తీవ్రమైన అన్యాయం జరిగేదన్నారు. తాము బతకడానికి భారంగా ఉండేదని, ఒకరి మీద ఆధారపడి జీవించే వాళ్లమని తెలిపారు. కొత్త ప్రభుత్వం సామాజిక పింఛన్లను రూ.3000 నుండి రూ.4వేలకు, వికలాంగులకు రూ.3000 నుండి రూ.6000కు పెంచడం పట్ల పాదాభివందనం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వెలగ సూరప్పారావు, బుగిడి నూక అప్పారావు, రాపేటి భాస్కరరావు, పెట్ల సన్యాసిరావు, బుద్ద ధనలక్ష్మి, ఆడారి అన్నపూర్ణ, వి.శీనమ్మ, పీలా స్వామి, ఈశ్వర అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

### టీచర్లను మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రత్యేక ట్రాన్స్‌ఫర్ ద్వారా ఏజెన్సీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వ్యాపాడ చిరంజీవికి పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు గోపీనాథ్ ఆధ్వర్యంలో ఆదివారం వినతి పత్రం అందజేశారు. అనకాపల్లిలో జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన చిరంజీవిని ఈ మేరకు వారు కలిశారు. మైదాన ప్రాంతం నుండి ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చెయ్యబడ్డ ఉపాధ్యాయులు నారా లోకేష్‌ను యువగళం పాదయాత్రలో కలిశామని, ప్రాథమిక విద్యకు తీవ్ర నష్టం కలిగించే 177 జీవోను రద్దు చేస్తామని నాడు ఆయన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ జీవో కారణంగా 2023 జూన్ నెలలో జరిగిన ఉపాధ్యాయుల సాధారణ బదిలీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారుగా 350 మంది ఉపాధ్యాయులు ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయ్యారని తెలిపారు. వీరిలో ఎక్కువమంది మహిళలు, చిన్నపిల్లల తల్లులు, 50సంవత్సరాలు వయస్సు పైబడ్డవారు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఉన్నారని పేర్కొన్నారు. వారిపై దయతో చొరవ తీసుకుని ప్రభుత్వంతో మాట్లాడి వెంటనే ప్రత్యేక బదిలీలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పిఆర్‌టియు ప్రతినిధులు పి.గణపతి, కె.ఉమా మహేశ్వరరావు, శ్రీలక్ష్మి, నారాయణరావు, తులసీ లక్ష్మి, భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### యలమంచిలి ఎమ్మెల్యేకి గండి బాబ్జి అభినందనలు

ప్రజాశక్తి- సబ్బవరం : సింహాచలం లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకోవడానికి కాలినడకన వెళ్తున్న యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్, టిడిపి, జనసేన నాయకులను సబ్బవరం మార్గమధ్యలో టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ గండి బాబ్జి కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వి.రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్ నిర్వహణకు ఏర్పాట్లు

## సచివాలయాల తరలింపులో మున్సిపల్ అధికార్లు

ప్రజాశక్తి - యలమంచిలి

పట్టణాల్లోని పేదలకు పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్‌లు తిరిగి తెరుచుకోనున్నాయి. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను నిర్వహించాలన్న నిర్ణయాన్ని ఇప్పటికే ప్రకటించింది. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో యలమంచిలి గురప్ప చెరువు ఆనుకుని రూ.35లక్షల వ్యయంతో నిర్మించిన అన్న క్యాంటీన్ భవనాన్ని వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత మున్సిపాలిటీ 4, 5 వార్డు సచివాలయాలుగా మార్పు చేశారు. అప్పట్లో ఈ అన్న క్యాంటీన్ భవనంలో సచివాలయాల ఏర్పాటును తెలుగుతమ్ముళ్లు వ్యతిరేకించినప్పటికీ వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. నూతన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ రెండు సచివాలయాలు వేరే చోటుకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్లు మూతపడిన విషయం విధితమే. అయితే ఆ తరువాత రోజుల్లో యలమంచిలి మెయిన్‌రోడ్డులోని తెలుగుదేశం కార్యాలయం ఎదురుగా 300 రోజులపాటు తెలుగుతమ్ముళ్లు తమ డబ్బులతో అన్న క్యాంటీన్ నిర్వహించారు. ఇందుకు పోలీసులు ఎన్నో రకాల ఇబ్బందులు పెట్టారని, అయినా నిర్వహించామని తెలుగుదేశం పట్టణశాఖ అధ్యక్ష, కార్యదర్శులు నానాజీ, రమణబాబు తెలిపారు.

### సచివాయాలను వేరే చోటకు తరలిస్తాం

భవనాల కొరత కారణంగా 4, 5 వార్డు సచివాలయాలు అన్న క్యాంటీన్ భవనంలో నిర్వహిస్తున్నాం. తిరిగి అన్న క్యాంటీన్ తెరుచుకోనుండడంతో అక్కడి సచివాలయాలను వేరే చోటకు మారుస్తాం. నిబంధనల ప్రకారం నడుచుకుంటాం.

- ప్రభాకరరావు, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్



గతంలో అన్నక్యాంటీన్ కోసం నిర్మించిన భవనంలో 4, 5 సచివాలయాలు

## ఎన్‌డిఎ కూటమి నేతల ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి-సబ్బవరం

ఎన్‌డిఎ కూటమి ఆత్మీయ సమావేశం మండలంలోని ఇరువాడ సమీపంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే పంచకర్ల బాబును కూటమి నేతలు ఘనంగా సత్కరించారు. టిడిపి పెందుర్తి నియోజకవర్గ ఇన్చార్జి గండి బాబ్జి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ అనకాపల్లి ఎంపీ నియోజకవర్గంలో తనను భారీ మెజార్టీతో గెలిపించిన కూటమి కార్యకర్తలకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. అనకాపల్లి ఎంపీ నియోజకవర్గాన్ని దేశంలోనే అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కాలుష్యం లేని పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శ్రీనివాస్ నాయుడు, వెంకటేశ్వరరావు, బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, గండి ముత్యాల నాయుడు, గండి దేముడు, రేసుపూడి రమణ, బుచ్చిరాజు, దొడ్డి సూర్య ప్రకాష్, గవర అప్పారావు, గవర సత్యనారాయణ, కర్రి కనకరాజు, గొర్లి రామునాయుడు పాల్గొన్నారు.

### రైతులను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

వైసీపీ ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ ఆరోపించారు. మండలంలోని పెదపాడు రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు వరి విత్తనాలను ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పాలనలో రైతులకు పలు రకాలుగా సబ్సిడీలతో కూడిన మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని చెప్పారు. వైసీపీ పాలనలో రైతులకు రైతు భరోసా పేరుతో రూ.6000తో సరిపెట్టారన్నారు. రైతులను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, టిడిపి, జనసేన నాయకులు రాజాన రమేష్ కుమార్, ధూళి రంగనాయకులు, జనపరెడ్డి నర్సింగరావు, బి రాందాస్, టెక్కలి పరశురాం, ఎం.శ్రీవేణి, గ్రామ సర్పంచ్ జనపరెడ్డి రమేష్, మండల వ్యవసాయ అధికారి శంకర్ పాల్గొన్నారు.

### 21న యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భారత స్వాభిమాన ట్రస్ట్ యోగ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మ నాయుడు, జార్జ్ క్లబ్ అధ్యక్షుడు బిఎస్ఎంకె జోగు నాయుడు, జి మంగయ్య, కెవివి సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, కోలాపర్తి కన్నబాబు, పెంటకోట సుబ్రహ్మణ్యం, ఆళ్ల సూర్యారామకృష్ణ, యోగ సాధకులు పాల్గొన్నారు.

### మెరిట్ విద్యార్థినికి ఘన సన్మానం

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గంజి హైమావతి 2024 పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ స్థానం (556/600) సాధించినందుకు హైమావతిని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి ఆదివారం సత్కరించారు. అనకాపల్లి జీవిఆర్ రెసిడెన్సీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థినికి మెమెంటోతో పాటు ప్రశంశా పత్రం అందించినట్లు పురుషోత్తపురం ఉపాధ్యాయులు మల్లిపాటి సత్యనారాయణ, ఎస్.నానిబాబు తెలిపారు.

# గ్రామ వాలంటీర్లలో ఆందోళన

## అయోమయంలో రాజీనామా చేసిన వారు - కొనసాగించాలని వేడుకోలు



ప్రభుత్వ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వాలంటీర్లు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - పరవాడ

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తమను కొనసాగిస్తారా? లేదా? అని మండలంలోని వివిధ సంచివాలయాల పరిధిలో ఉన్న గ్రామ వాలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. వైసిపి నాయకులు ఒత్తిడి చేసినా రాజీనామా చేయలేదని, తమను కొనసాగించాలని వారు వేడుకుంటున్నారు. మరోవైపు వైసిపి నాయకుల ఒత్తిడి మేరకు రాజీనామా చేసిన వాలంటీర్లు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. తమ పరిస్థితి ఏమిటని అంతర్మథనం చెందుతున్నారు.

వైసిపి ప్రభుత్వం మండలంలోని 16 పంచాయతీల పరిధిలో గ్రామ సచివాలయంలో 302 వాలంటీరు పోస్టులకు ఎంపీడీవో ఆధ్వర్యాన ఇంటర్వూలు నిర్వహించి నియామకాలు చేశారు. ఇలా గ్రామ వాలంటీర్లుగా నియమితులైన వారిలో అత్యధికంగా మహిళలు ఉన్నారు. గ్రామ వాలంటీర్లు ప్రతినెలా 1వ తేదీన ఉదయమే తమకు కేటాయించిన 50 ఇళ్ల పరిధిలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఇతర పింఛనుదారులకు పింఛను డబ్బులు అందజేసేవారు. అలాగే వివిధ ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు సేకరించి ప్రభుత్వ అధికారులకు సమర్పించేవారు. ప్రభుత్వ పథకాలు, నిర్ణయాల సమాచారం ప్రజలకు తెలియజేసేవారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ.5వేలు గౌరవ వేతనం నిర్ణయించి, పంచాయతీ కార్యదర్శి ద్వారా చెల్లించేది. అయితే ఈ వాలంటీర్లు వైసిపి గ్రామ నాయకులు చెప్పిన విధంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. కొంత మంది ఆ పార్టీకి కార్యకర్తలుగా పని చేస్తున్నారన్న ఆరోపణలు నేపథ్యంలో ఇటీవల సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా గ్రామ వాలంటీర్లను తాత్కాలికంగా విధులు నుండి నిలుపుదల చేశారు. దీంతో ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలుగా ఉపయోగించుకోవడానికి వైసిపి నాయకుల ఒత్తిడి మేరకు కొంత మంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు.

ఈ విధంగా పరవాడ మండలంలో 106 మంది వాలంటీర్లు చేత వైసిపి నాయకులు రాజీనామాలు చేయించారన్న ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది రాజీనామాలు చేయడానికి ఇష్టపడకపోతే మళ్లీ వైసిపి ప్రభుత్వం వస్తుందని, తిరిగి మిమ్మల్నే వాలంటీర్లుగా తీసుకుంటామని నమ్మించి తమను నెట్టేట ముంచారని రాజీనామా చేసిన వాలంటీర్లు వాపోతున్నారు. పరవాడ మండల పరిధిలోని పెదముషిడివాడ సచివాలయంలో 16 మంది, గొర్లివానిపాలెంలో 19 మంది, రావాడలో 11 మంది, తానాం సచివాలయం-1లో 17 మంది, తానాం-2లో 10 మంది, వాడచీపురుపల్లి-1లో 21 మంది, వాడచీపురుపల్లి-2లో 11 మంది, ముత్యాలమ్మపాలెం సచివాలయంలో ఒకరు మొత్తం 106 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వారు తాము వైసిపి నాయకుల మాటలు నమ్మి నష్టపోతున్నామని వాపోతున్నారు. అయితే వైసిపి నాయకులు ఒత్తిడి తెచ్చినా మండలంలో 196 మంది వాలంటీర్లు రాజీనామాలు చేయలేదు. తమను కూటమి ప్రభుత్వం ఉంచుతుందా? ఊడదీస్తుందా అనే భయం వీరిలో నెలకొంది. ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తే వాలంటీర్లకు రూ.10వేలు చొప్పున గౌరవ వేతనం ఇస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు ప్రకటించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో గ్రామాల్లో వాలంటీరు పోస్టులకు డిమాండ్ నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏ ఒక్క వాలంటీరును తొలగించకుండా తమకు విధులను, బాధ్యతలను అప్పగిస్తే సంతోషంగా నెరవేరుస్తామని వాలంటీర్లు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం ఏమి చేస్తుందో వేచి చూడాలి.

# కాలువ స్థలం ఆక్రమణ

## -పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం



పది అడుగుల నుంచి రెండు అడుగులకు తగ్గిన కాలువ

**ప్రజాశక్తి -కోటవురట్ల:**మండలంలో కేబీ అగ్రహారం రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబర్ 5-8 వెంకటాపురం వెళ్లే ప్రధాన రహదారి అనుకుని ఉన్న చెరువుకు వెళ్లే కాలువను ఆక్రమించుకున్నా అధికారులు పట్టించుకోలేదు. కాలువను ఆక్రమించుకోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి నీరు రోడ్డుపై ప్రవహించింది. రోడ్డుపై ప్రవహించడంతో తిరిగి మళ్లీ ఆక్రమించుకున్న భూమిలో కాలువను తవ్వడం విశేషం. గతంలో కాలువ సుమారు పది అడుగుల వరకు ఉండేదని ప్రస్తుతం నీరు పోయేందుకు మాత్రం కాలువ తవ్వడం విడ్డూరంగా ఉందని సమీప ప్రాంతవాసులు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నా అధికారులు పట్టించుకోక పోవడం పట్ల పలు సంఘాల నాయకులు సైతం తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ స్థలాల ఆక్రమణ పై దృష్టి సారించారని కోరుతున్నారు.

## జల్లూరు వంతెన పనులు పూర్తి చేయాలి

### -సిఎం రమేష్

### -స్టీల్‌ప్లాంట్‌పై సమాధానం దాటవేత

**ప్రజాశక్తి -కోటఉరట్ల:** మండలంలో అసంపూర్తిగా నిలిచిన జల్లూరు వంతెన పనులను ఎంపీ సీఎం రమేష్ పరిశీలించారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ, 62 లక్షల పెండింగ్ బిల్లులు ఉండటంతో పనులు నిలిపివేయడం దారుణ మన్నారు. డివిజన్ కేంద్రానికి వెళ్లే ప్రజలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నా గత నాయకులు ఏమి చేస్తున్నారన్నారు.తక్షణమే పనులు ప్రారంభించాలని, అవసరమైతే ఎంపీ, సిఎస్ఆర్ నిధులతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలని గుత్తేదారునికి సూచించారు.విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణనను కేంద్ర ప్రభుత్వం విరమించుకున్నట్లేనా అని ప్రజాశక్తి విలేకరి అడిగిన ప్రశ్నకు ఇప్పుడు అది అవసరమా అని సమాధానం దాటవేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బుజ్జి, టిడిపి జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు జానకి శ్రీను, జనసేన పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్, ఆర్ అండ్ బి డిఈ నాగ మోహన్‌రావు, ఏఈ రెడ్డి పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎంపీ



రోడ్డుపై పడిన చెట్లు

## రోడ్డుపై పడిన చెట్లను తొలగించరూ...

**ప్రజాశక్తి-గొలుగొండ:**శనివారం సాయంత్రం మండలంలోని వీచిన ఈదురుగాలులకు రోడ్లపై పడిన చెట్లు ఇంకా దర్శనమిస్తున్నాయి. కృష్ణదేవిపేట నుంచి కొండగోకిరి వెళ్లే రోడ్డుపై నేల కొరిగిన తాటి చెట్లు ఇంకా అక్కడే ఉన్నాయి. ఈ ప్రాంతంలో పలు చోట్ల వివిధ చెట్లు రోడ్ల మీదే ఉన్నాయి. దీంతో, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ఈ చెట్లను తొలగించాలని వారు కోరుతున్నారు.




చదివిస్తున్న గ్రంథాలయాధికారి దమయంతి

## గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**నర్సీపట్నం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి దమయంతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలతో నీతి కథలు చదివించారు. ఫాదర్స్ డేను పురస్కరించుకొని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ 'నాన్నే మా హీరో అనే కథను పిల్లలకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ, తల్లిదండ్రుల పట్ల విధేయతతో మెలగాలని సూచించారు.



కల్వర్టును పరిశీలిస్తున్న అధికారులు

## శిథిల కల్వర్టుపై భారీ వాహనాలకు ఆంక్షలు

### -ప్రజాశక్తి కథనానికి స్పందన

**ప్రజాశక్తి-కోటవరట్ల:**మండలంలోని పందూరు రామచంద్రపురం సెంటర్ వద్ద శిథిల కల్వర్టు పై ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి రహదారులు భవనాలు శాఖ అధికారులు స్పందించారు. ఆదివారం కల్వర్టును పరిశీలించి భారీ వాహనాలకు అనుమతి లేకుండా ఆంక్షలు విధించారు. ఆర్ అండ్ బి డి నాగమోహనరావు సహా జేఈఈ రెడ్డి కలవర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా భారీ వాహనాలకు అనుమతి లేకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

# కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**ఈ వేసవి సెలవులలో నర్సీపట్నం ఆర్పి మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులు, చిన్నారులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు ప్రధానోత్సవం నిర్వహించారు. రైయూన్ రియో ఫోటోకాన్ కరాటే డూ ఇండియా సౌజన్యంతో ఈ కార్యక్రమంలో వేసవి శిక్షణ శిబిరం కరాటేలో తర్ఫీదు పొందిన సుమారు 80 మంది కరాటే విద్యార్థులకు ఆర్పి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ వెలగ రావు, డైరెక్టర్ పివిఎం.నాగజ్యోతి చేతుల మీదుగా సర్టిఫికెట్లు మెమెంటోలు అందించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ, క్రీడలు శారీరక ఉల్లాసాన్నే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తాయన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందడం చాలా ఉపయోగమని, భవిష్యత్తులో తమను రక్షించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాన్‌ఫోర్స్ స్కూల్ ప్రిన్సిపాల్, ఇంటర్నేషనల్ స్విమ్మర్ కె.సాహితి హాజరయ్యారు.



సర్టిఫికెట్లు ఇస్తున్న అకాడమీ చైర్మన్, డైరెక్టర్

# రోడ్లపై పశువుల తిష్ట

### ఇబ్బంది పడుతున్న వాహనదారులు

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:** పట్టణంలోని రోడ్లపై పశువుల సంచారంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులపై ఇవి తిష్ట వేస్తున్నాయి. వాహనచోదకులకు అడ్డం పడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే శారదానగర్, పాల్‌ఘాట్ సెంటర్, అబీద్ సెంటర్ వంటి ప్రాంతాల్లో వీటి సంచారం ఎక్కువైంది. అడ్డంగా వచ్చిన పశువులను తప్పించబోయి తరచూ వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువులను నియంత్రించాలని కోరుతున్నారు.



రోడ్డుపై ఉన్న పశువులు

## రంగురాళ్ల తవ్వకాలు చేపడితే చర్యలు

### -ఎస్ఐ కృష్ణారావు

**ప్రజాశక్తి-గొలుగొండ:**ఎవరైనా రంగురాళ్ల తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని గొలుగొండ ఎస్సై బీ.కృష్ణారావు హెచ్చరించారు. ఆరిలోవ రిజర్వ్ ఫారెస్ట్‌లో రంగురాళ్ల తవ్వకాలు జరిగాయన్న విషయంపై ఆదివారం ఉదయం ఆ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, రంగురాళ్ల తవ్వకాలపై పటిష్ట నిఘా ఉంచామన్నారు. తవ్వకాలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



పరిశీలిస్తున్న పోలీసులు



సారేను ఊరేగిస్తున్న గ్రామస్తులు

## ఘనంగా మోదకొండమ్మ సారె ఊరేగింపు

**ప్రజాశక్తి -మాడుగుల:** ఈనెల 18న మోదకొండమ్మ అమ్మవారి పండుగను పురస్కరించుకొని అమ్మవారి సారెను ఆదివారం ఘనంగా ఊరేగించారు. మాడుగుల గ్రామంలో మోదమాంబ కాలనీ, రాజ వీధికి చెందిన మహిళలు, ప్రజలు భారీ ఎత్తున పిండి వంటలతో శతకం పట్టు వద్దకు మేళతాళాలతో ఊరేగించారు.

## కూటమి నేతల సంబరాలు

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలో పలు గ్రామాల్లో ఎన్డీఏ కూటమి గెలుపుపై ఆయా పార్టీల కార్యకర్తలు విజయోత్సవాలు నిర్వహించారు. మండలంలో లింగంపేట, ఎర్రవరం గ్రామాల్లో టీడీపీ నాయకులు, పాతకృష్ణదేవిపేట గ్రామంలో బీజేపి నాయకులు ఈ విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా లింగంపేటలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు మరిసా వెంకటరమణ, పాతకృష్ణదేవిపేటలో బిజెపి మండల ఉపాధ్యక్షులు గల్లా నూకరాజు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. లింగంపేట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నర్సీపట్నం కౌన్సిలర్ చింతకాయల రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని నూకాంబిక అమ్మవారిని దర్శించుకొని కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చిటికెల తారకవేణుగోపాల్, బిజెపి మండల పార్టీ అధ్యక్షుల గౌరీనాయుడు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

### పిల్లర్ దశలో నిలిచిన..

# కళాశాల హాస్టల్ భవనం పనులు

**ప్రజాశక్తి -అనంతగిరి:**స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్ భవనం పనులు మధ్యలోనే నిలిచి పోయాయి. దీంతో, విద్యార్థులు అద్దె రూముల్లో ఉంటూ చదువుకోవాల్సి వస్తుంది.

అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్ వసతి భవనం నిర్మాణానికి 2014 సంవత్సరంలో ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఆ పనులు పునాది దశ నుండి పిల్లర్స్ వరకు చేపట్టారు. అనంతరం గుత్తేదారులకు పేమెంట్లను అప్పటి వైసిపి ప్రభుత్వం చెల్లించక పోవడంతో పనులను నిలిపివేశారు. దీంతో, ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి. గత్యంతరం లేక విద్యార్థులు అద్దె రూములలో ఉంటూ చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రూములకు ఖర్చులకు ఆర్థిక స్థోమత లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నూతనం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన కళాశాల వసతి భవనం పనులు పూర్తి చేయాలని పలువురునేతలు కోరుతున్నారు.



పిల్లర్ దశలో నిలిచి పోయిన భవనం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు

## ప్రతి ఇంటికీ తాగునీరు

**- ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు**

**ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:**గ్రామంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించే విధంగా నిర్మాణం చేపట్టాలని చోడవరం ఎమ్మెల్యే కె ఎస్ఎన్ రాజు ఆదేశించారు. తట్టబంధ పంచాయతీ శివారు ఎల్ఎన్ పురం, బూరుగుపాలెం, బలిజపాలెం లో జనజీవన్ మిషన్ పథకంలో భాగంగా 95 లక్షల రూపాయలతో నిర్మించనున్న ఇంటింటికి కుళాయిల పథకానికి ఆదివారం ఎమ్మెల్యే రాజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పథకంలో నిర్మాణం అవుతున్న పనులు తూతూ మంత్రంగా చేపట్టడంతో పలు ఇళ్ళకు నీరు చేరలేదని తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా విభాగ ఇంజనీరింగ్ అధికారులు ప్రతి ఇంటికి తాగునీరు చేరే విధంగా పైపులైను నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రాజానకొండ నాయుడు, సర్పంచ్ గోకివాడ రమణ, చినపాచిల సర్పంచ్ కోమటి శంకర్‌రావు పాల్గొన్నారు.



రోధిస్తున్న కుటుంబ సభ్యులు

## చెట్టు పైనుండి పడి కల్లు గీత కార్మికుడు మృతి

**ప్రజాశక్తి -నక్కపల్లి:**నక్కపల్లి కి చెందిన ఓ కల్లుగీత కార్మికుడు చెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. కల్లుగీత కార్మికుడు శ్రీను (26) ఆదివారం ఉదయం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి జారి పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీను మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. నక్కపల్లి లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సి కిషోర్ కేసు నమోదు చేశారు .

## మంత్రిని కలిసిన టిడిపి నేతలు

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:** రాష్ట్ర గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంధ్యారాణిని స్థానిక మండల టిడిపి నాయకులు ఆదివారం మర్యాదపూర్వం కలిసి అభినందించారు. మంత్రి స్వగృహంలో మండల టిడిసి మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం ఆమెతో మాట్లాడుతూ, వైసిపి హయంలో మండల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయిందని, శాశ్వత రోడ్లు, తాగునీరు, వీధి కాలువలు, వీధి రోడ్లు కల్పించి గిరిజనులకు తోడ్పాటునివ్వాలని కోరారు. మండలంలో రోడ్లకు శంకుస్థాపనలు చేసి పనులు చేయకుండా వదిలేయంతో రవాణా కష్టాలతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని ఆమె దృషికి తీసుకెళ్లారు. రోగాలు, ఇతర పనులకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సుబ్బారావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి, సర్పంచి వెంకటరమణరాజు, సర్పంచులు పాండురంగస్వామి, సత్యనారాయణ, మాజీ సర్పంచులు వాసుదేవ్, వెంకటరావు, అరకు అసెంబ్లీ ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకర్రావు, నాయకుడ స్వామి , తదితరులు పాల్గొన్నారు.

# వెంకన్నను దర్శించుకున్న మంత్రి అనిత

## -ఉపమాకలో ఘన స్వాగతం పలికిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

**ప్రజాశక్తి -నక్కపల్లి:**రాష్ట్ర హెూంశాఖ, విపత్తుల నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత శనివారం రాత్రి ఉపమాక వెంకన్నను దర్శించుకున్నారు. పాయకరావుపేట నుండి జాతీయ రహదారి మీదుగా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు ధర్మవరం వరకు పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి రాత్రి 10 గంటలకు ఉపమాక చేరుకున్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, యువ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి పార్టీ శ్రేణులతో కలిసి ఆమెకు ఘన స్వాగతం పలికారు. ముందుగా క్రేన్ సహాయంతో భారీ గజమాలతో అనితను సత్కరించారు. కొండబాబు, బుజ్జి కలిసి ఆమెకు షీల్డ్ ను బహుకరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి అనితకు హారతులు పట్టి, పూల వర్షం కురిపించారు.

అనంతరం ఉపమాక వెంకన్న ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, ఆలయ అధికారులు ఆలయంలో అనితకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ప్రసాద్ ఆచార్యులు అనితకు పట్టు వస్త్రాలు సమర్పించి, జ్ఞాపికను అందజేశారు. అనిత ఉపమాక రాకతో కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో దారి పొడవునా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. భారీగా బాణాసంచా పేల్చారు. పలువురు నేతలు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ నాయకులు కొప్పిశెట్టి శ్రీను, కొంకిపూడి దొరబాబు, ప్రగడ వీరబాబు, తోలేటి శ్రీనివాస్, కొప్పిశెట్టి వాసు, హరి, దిలీప్,పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.



అనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

పాయకరావుపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎవరికి దక్కని మంత్రి పదవి వంగలపూడి అనిత కు వరించడంపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, యువ నాయకులు బుజ్జి హర్షం వ్యక్తం చేసారు. పాయకరావుపేట నియోజకవర్గంలో గతంలో మునుపెన్నడూ లేని విధంగా ప్రత్యర్ధి అభ్యర్ధి పై 43,727 ఓట్లు అత్యధిక మెజారిటీతో అనిత గెలుపొంది రికార్డు బద్దలు కొట్టారని, ఇప్పుడు మంత్రి పదవి సాధించి చరిత్ర సృష్టించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనితకు మంత్రివర్గంలో చోటు కల్పించి పాయకరావుపేట నియోజకవర్గంకు గౌరవం కల్పించారని అన్నారు. హెూం మంత్రి అనిత సారధ్యంలో పాయకరావుపేట నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందని, ఉపమాక వెంకన్న ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

### అనితను కలిసిన అధికారులు, అంగన్‌వాడీలు

**నక్కపల్లి :**హెూం మంత్రి వంగలపూడి అనితను పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నక్కపల్లిలో క్రిష్ టౌన్ షిప్‌లో ఆమె స్వగృహంలో అనితను ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, శ్రీను తదితర అధికారులు కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హెూంమంత్రి వంగలపూడి అనితను అంగన్వాడీలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు దుర్గారాణి, యూనియన్ నాయకులు సుబ్బలక్ష్మి, రమణమ్మ, కవిత, నూకరత్నం, జ్యోతి, తులసి, లక్ష్మి, సీతా రత్నం, చిన్నమ్ములు, సెక్టార్ లీడర్లు కలిసి శాలువాతో సత్కరించి, వెంకన్న జ్ఞాపికను అందజేసారు.



అనితకు వెంకన్న చిత్ర పటాన్ని అందజేస్తున్న పురోహితులు

# శిథిలావస్థలో పిఎసిఎస్ భవనం

**-ఊడిపడుతున్న పై పెచ్చులు**
**-నూతన ప్రభుత్వమైనా నిర్మించేనా..**

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండల కేంద్రంలో చోద్యం పి ఎస్‌సిఎస్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. సుమారు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనం లోపల పైకప్పు భాగమంతా పెచ్చులూడి ప్రమాద భరితంగా తయారైంది. సీలింగ్ పెచ్చులూడి పోవడంతో కొద్దిపాటి వర్షం కురిసినా నీరంతా లోపల గదిలోకి చేరడంతో రికార్డులు భద్రపరచడం కత్తి మీద సాములా మారింది. సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో పలుమార్లు శ్లాబ్ పెచ్చులూడి పడటంతో పలువురు గాయాల పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. పురాతన భవనం కావడంతో దాని స్థానంలో కొత్త భవనం మంజూరు చేయాలని సొసైటీ రైతులు. సిబ్బంది కోరుతున్నారు.

ఈ సొసైటీ ద్వారా 2.622 మంది రైతులకు సేవలు అందుతున్నాయి. ఏటా ఈ సొసైటీ టర్నోవర్ 6.6 కోట్ల రూపాయలు. సొసైటీలో స్ట్రాంగ్ రూమ్ లేకపోవడంతో గోల్డ్ భద్రపరచలేక బంగారంపై రుణాలను రైతులకు అందించలేక పోతున్నామన్నామని సొసైటీ కార్యదర్శి రాజు అన్నారు. భవనాన్ని ఏర్పాటు చేసుకుంటే రైతులకు బంగారంపై రుణాలను అందించుకోగలమని, వారికి మరిన్ని సేవలు అందుబాటులో అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఇప్పటికే సొసైటీ ద్వారా ఎస్టీ, ఇతరులకు 3.6 కోట్ల రూపాయలను 84 మంది రైతులకు రుణాలకు అందజేశామన్నారు. రికవరీ లో కూడా ముందులో ఉన్నామని ఆయన తెలిపారు.

పాత భవనం తొలగించి కొత్త భవనం ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని రైతులు, సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు.





శిథిలావస్థలో పిఎసిఎస్ భవనం



భవనం లోపల ఊడిన పై పెచ్చులు

### భవనాన్ని మంజూరు చేయాలి

సొసైటీ ద్వారా రైతులకు రుణాల సేవలందిస్తున్నాం. నూతన భవనం నిర్మిస్తే రైతులకు ఎరువులు, బంగారంపై రుణాలు అందించడం వంటి సేవలను అందించే అవకాశం ఉంటుంది.కొత్త భవనం నిర్మాణానికి ఉన్నతాధికారులు అను మతులు మంజూరు చేయాలి.



**రాజు,**
**సొసైటీ కార్యదర్శి**